## ఆస్తి పన్ను బకాయిల పెనాల్టీపై 90 శాతం రాయితీ

కొత్తూరు, ఫిబ్రవరి 29: తెలంగాణ ప్రభుత్వం ఆస్తి పన్ను బకాయిల పెనాల్టీపై 90 శాతం రాయితీ ఇస్తుందని కొత్తూరు మున్సిపల్ కమిషనర్ బాలాజీ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2017–18 ఆర్థిక సంవత్సరం నుంచి 2022–23 ఆర్థిక సంవత్సరం వరకు గల ఆస్తి పన్ను బకాయి పెనాల్టీపై 90 శాతం వడ్డీ రాయితీ ఉంటుందని తెలిపారు. కొత్తూరు పట్టణ ఆస్తి పన్ను యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 2023–24 ఆర్థిక సంవత్సరం ఇంటి పన్ను పెనాల్టీపై రాయితీ లేదని స్పష్టం చేశారు. నీటి పన్ను బకాయిలపై కూడా ఎలాంటి రాయితీ లేదని పేర్కొన్నారు.

**ఆదిబట్ల :** ఆస్తిపన్ను సకాలంలో చెల్లించిన వారికి ప్రభుత్వం 90 శాతం రాయితీ కల్పిస్తుందని ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆస్తిపన్ను వడ్డీపై 90శాతం రాయితీ ఇవ్వాలని నిర్ణయించిందని 2023–24 ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న పన్ను బకాయిలపై వడ్డీని మాఫీ చేస్తూ జీవో 101ను ప్రభుత్వం జారీ చేసిందని అన్నారు. ఈ అవకాశం 2023–24 సంవత్సరం నాటికి ఆస్తి పన్ను పూర్తిగా బకాయి ఉండి చెల్లించే వారికి మాత్రమే 90శాతం రాయితీ అమలవుతుందని 2023 సంవత్సరం బకాయిలను వడ్డీతో సహా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో చెల్లించన పక్షంలో 90శాతం వడ్డీ రాయితీ మొత్తాన్ని తరువాత చెల్లించాల్సిన ఆస్తి పన్నులో సర్దుబాటు చేస్తామన్నారు. ఈ అవకాశం ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఆయన కోరారు.

## నేటి నుంచి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



మండల పశువైద్యాధికారి సీహెచ్ నర్సింహారావు

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 29 : మండల పరిధిలోని గ్రామాల్లో నేటి నుంచి ఈ నెల 30 వరకు గేదలు, ఆవులకు గాలికుంటు నివారణ టీకాలు వేయనున్నట్లు మండల పశువైద్యాధికారి సీహెచ్ నర్సింహారావు తెలిపారు. గాలికుంటు వ్యాధి సోకిన పశువుల్లో పాలఉత్పత్తి తగ్గిపోవడంతో పాటు పునరుత్పత్తి సామర్థ్యం తగ్గుతుందన్నారు. నాలుక చిగుళ్లు ముట్టె ప్రాంతాల్లో పుండ్లు ఏర్పడి ఆహారం సరిగ్గా తీసుకోకపోవడం వల్ల పశువులు నీరసించి పోతాయన్నారు. మండలంలోని రైతులు తప్పనిసరిగా పశువులకు టీకాలు వేయించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8790997957 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

# ధైర్య సాహసాలు అలవర్చుకోవాలి

- సీనియర్ సివిల్ జడ్జి ఇందిర



విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి, అసోసియేషన్ నిర్వాహకులు జాకీర్ హుస్సేన్

ఇబ్రహీంపట్నంరూరల్, ఫిబ్రవరి 29 : విద్యార్థులు బాల్యదశ నుంచే ధైర్యం, ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని రంగారెడ్డిజిల్లా లీగల్ అథారిటీ సెక్రటరీ, సీనియర్ సివిల్‌జడ్జి ఇందిరా అన్నారు. మండల పరిధిలోని ఉప్పరిగూడ ప్రభుత్వ యూపీఎస్ పాఠశాలలో చైల్డ్ చాప్టర్ అసోసియేషన్ నిర్వాహకులు షైక్ జాకీర్ హుస్సేన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ... చిన్నపిల్లలను బాధ్యతగా చూసుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఎంతో ఉందన్నారు. ముఖ్యంగా విద్యార్థులు ధైర్య సాహసాలు పెంపొందించినప్పుడే వారు ఎంతో ముందుకు సాగుతారన్నారు. ఈ సందర్భంగా చైల్డ్ చాపర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తయారుచేసిన చైల్డ్ స్టోరీ బుక్‌ను ఆమె ఆవిష్కరించి విద్యార్థులకు అందించారు. ఈ పుస్తకంలో విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చిన్నతనం నుంచి అలవర్చుకోవాల్సిన విధానానికి సంబంధించిన వివరాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నారాయణరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా కాలభైరవ విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠాపన పూజల్లో భక్తులు, బ్రాహ్మణులు

పెద్దఅంబర్‌పేట, ఫిబ్రవరి 29: మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారంలోని లలిత భువనేశ్వరి సమేత చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయంలో మూడ్రోజులుగా విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు సాగుతున్నాయి. రావిరాల పరమేశ్వర శాస్త్రి, అల్లూరి శివ విష్ణు బ్రహ్మ ఆధ్వర్యంలో గురువారం వల్లీదేవసేన సమేత నాగ సుబ్రహ్మణ్య స్వామి, కాలభైరవస్వామి వార్ల విగ్రహాల ప్రతిష్ఠాపన నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కె.మహేందర్ తెలిపారు. కార్యక్రమంలో విగ్రహ దాతలు కోట బాలకృష్ణారావు, చిదురాల మహేశ్, ప్రతిష్ఠాపకులు సంతోశ్‌శర్మ, సుబ్రహ్మణ్యశర్మ, నవరత్న తారకరామ ఆచార్య, శ్రీనివాస్‌శర్మ, గ్రామస్తులు మహేశ్, వినోద్, అమర్‌నాథ్ పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



భవన నిర్మాణ తెలంగాణ కార్మిక సంక్షేమ బోర్డు కార్యదర్శి గంగాధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న యాదయ్య తదితరులు

షాబాద్, ఫిబ్రవరి 29 : భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో పాలక ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య అన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జాతీయ పిలుపులో భాగంగా నిర్మాణ కార్మికుల సమస్యలపై గురువారం హైదరాబాద్ నగరంలోని చిక్కడపల్లి కార్మిక సంక్షేమ భవనంలో భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు రాష్ట్ర కార్యదర్శి గంగాధర్, రంగారెడ్డిజిల్లా అసిస్టెంట్ లేబర్ కమిషనర్ చతుర్వేదికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఓరుగంటి యాదయ్య మాట్లాడుతూ... నిర్మాణ సంక్షేమ బోర్డులో సుమారు రూ.2వేల కోట్లు ఉన్నప్పటికీ, కార్మికుల సంక్షేమం కోసం, వారి అభివృద్ధికి వాటిని ఖర్చు చేయడంలో సంక్షేమ బోర్డు విఫలమైందని అన్నారు. నిర్మాణ కార్మికులకు సంబంధించిన అన్ని రకాల చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు పనిచేస్తున్న ప్రదేశాలలో లేబర్ అధికారులు సందర్శించి చట్టాల అమలుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రంగారెడ్డిజిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసాద్, స్వామి, సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఇంటి పన్ను సకాలంలో చెల్లించాలి

మంచాల, ఫిబ్రవరి 29: ఇంటి పన్నును సకాలంలో చెల్లించి గ్రామ అభివృద్ధికి సహరించాలని ఎంపీవో తేజ్‌సింగ్ అన్నారు. గురువారం మంచాల గ్రామంలో ఇంటి పన్నును వసూలు చేస్తున్న అధికారుల పని తీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించుకోవాలంటే ప్రతి ఒక్కరూ సకాలంలో ఇంటి పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. మార్చి పది తారీఖులోపు వంద శాతం ఇంటి పన్నును వసూలు చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ యువకులు క్రీడల్లో రాణించాలి



జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న జడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి

షాబాద్, ఫిబ్రవరి 29 : గ్రామీణ ప్రాంతాల యువకులు క్రీడల్లో రాణించాలని జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పీఆర్‌ఆర్ స్టేడియంలో దివంగత నేత రాజేందర్‌రెడ్డి స్మారకార్థం నిర్వహిస్తున్న జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రూ.50 లక్షలతో షాబాద్‌లో స్టేడియం ఏర్పాటు చేసినట్లు వివరించారు. క్రీడా స్ఫూర్తితో పోటీపడాలన్నారు. కార్యక్రమంలో క్రీడల నిర్వాహకులు మహేశ్ యాదవ్, రమేశ్‌యాదవ్, ధనుంజయ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు నక్క శ్రీనివాస్ గౌడ్, జడల రాజేందర్‌గౌడ్, కొలన్ ప్రభాకర్ రెడ్డి, చల్లా శ్రీరాంరెడ్డి, కౌకుంట్ల రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్షకు 112మంది గైర్హాజరు



పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష రాసేందుకు వెళ్తున్న విద్యార్థులు

షాద్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 29 : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర వార్షిక పరీక్షలు గురువారం సజావుగా కొనసాగాయి. షాద్‌నగర్ పట్టణంలో 6 కేంద్రాల్లో ఎగ్జామ్స్ నిర్వహించగా, 1757మంది విద్యార్థులకు గానూ 1658మంది హాజరు కాగా, 99మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 422మంది ఒకేషనల్ విద్యార్థులకు 409మంది పరీక్షకు హాజరు కాగా, 13మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు కస్టోడియన్లు వి.శ్రీకాంత్, చంద్రశేఖర్ తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి విరాళం



పాఠశాల అభివృద్ధికి విరాళం అందజేసిన గోపగోని శ్రీశైలంగౌడ్

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 29 : మజీద్‌పూర్ గ్రామ జిల్లాపరిషత్ ఉన్న పాఠశాల అభివృద్ధికి ఎల్లప్పుడూ తన సహకారం ఉంటుందని శ్రీజ డెవలపర్స్ అధినేత, బీఆర్‌ఎస్ నాయకుడు గోపగోని శ్రీశైలంగౌడ్ అన్నారు. 'ఇంటికి వంద బడికి చందా' పేరుతో నిర్వహించిన విరాళాల్లో భాగంగా తన వంతు రూ. లక్షా 55వేల చెక్కును గురువారం ఆయన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ భాస్కర్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తాను సేవలందించే అవకాశం కలగడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదవాలని సూచించారు. కార్యక్రమంలో వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రవీంద్ర, నాయకులు ఎడ్ల మహేందర్‌ముదిరాజ్, దూసరి గణేశ్ గౌడ్, రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

## విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

మొయినాబాద్, ఫిబ్రవరి 29 : విద్యార్థులు ప్రాథమిక విద్యా దశ నుంచే ప్రయోగాత్మకమైన నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని గురుకుల విద్యా సంస్థ రంగారెడ్డి, హైదరాబాద్ వెస్ట్ రీజియన్ కో–ఆర్డినేటర్ శారదావెంకటేశ్ అన్నారు. మండల పరిధిలోని తోలుకట్టా గ్రామ సమీపంలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ బంట్వారం గురుకుల పాఠశాల/కళాశాలలో గురువారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ అంశాలపై ప్రయోగాలను చేసి ప్రదర్శించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ప్రయోగాత్మకమైన నైపుణ్యం ఉంటే విద్యాభ్యాసంలో ఉత్తమ ఫలితాలను సాధించడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. గురుకుల పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా విద్యను అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గాంధీ కింగ్ ఫౌండేషన్ చైర్మన్ ప్రొఫెసర్ ప్రసాద్, చేవెళ్ల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డి.రమాదేవి, చేవెళ్ల గురుకుల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## శివాలయంలో ఘనంగా బ్రహ్మోత్సవాలు



హోమంలో పాల్గొన్న భక్తులు

చేవెళ్లటౌన్, ఫిబ్రవరి 29: చేవెళ్లలోని కొనగట్టు శివాలయ, శ్రీ భ్రమరంభ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు రెండవ రోజు గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం రుద్రాభిషేకం, సహస్ర బిల్వార్చన. అమ్మవారికి సహస్ర పుష్పార్చన, రుద్రహోమం, పూర్ణాహుతి, మంగళహారతులు, మధ్యాహ్నం అన్నదానం, రాత్రి భజన కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారని ఆలయ ప్రధాన అర్చకులు సురేశ్‌కుమార్ తెలిపారు.

## హోటళ్లలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



హోటళ్లను తనిఖీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 29: హోటళ్లలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే చట్టపరమైన చర్యలతో పాటు, లైసెన్స్‌లను రద్దు చేస్తామని శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని మసూల్‌దార్ మండి, పల్లె రుచులు, మన రెస్టారెంట్ హోటళ్లలో తనిఖీలు నిర్వహించగా, రెండు రోజుల క్రితం చికెన్ ఫ్రిడ్జ్‌లో నిల్వ ఉంచడంపై హోటల్ యజమానులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉడకపెట్టిన గుడ్లు నిల్వ ఉంచడంతో పాటు హోటల్‌లో శుభ్రత, సిబ్బంది శుభ్రంగా లేకపోవడంతో మసూల్‌దార్ మండి హోటల్‌కు రూ.40వేలు, పల్లె రుచులు హోటల్‌కు రూ.30 వేలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫుడ్ సేఫ్టీ రూల్స్ ప్రకారం హోటల్‌లను నిర్వహిస్తున్న యజమానులు తప్పనిసరిగా నాణ్యత పాటిస్తూ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని హోటల్‌లను నడిపించాలని ఆయన హెచ్చరించారు. ఈ తనిఖీల్లో మేనేజర్ అంజన్‌కుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



మంచాల, ఫిబ్రవరి 29: మంచాల మండలం చిత్తాపూర్ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు గురువారం బీఆర్‌ఎస్ మండల నాయకుడు బొడ్డు నాగరాజుగౌడ్ నోట్ పుస్తకాలను ఉపాధ్యాయులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య బోధన చేస్తున్నందున ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ముంతాజ్ బేగం, పాండు, మల్లేశ్ పాల్గొన్నారు.

## నేడు షాబాద్‌లో పట్నం రాజేందర్‌రెడ్డి వర్ధంతి

షాబాద్, ఫిబ్రవరి 29: మండలంలో దివంగత నేత పట్నం రాజేందర్‌రెడ్డి 36వ వర్ధంతి వేడుకలను శుక్రవారం నిర్వహిస్తున్నట్లు బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు గూడూర్ నర్సింగ్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలకు చేవెళ్ల మండల కేంద్రంలో రాజేందర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నట్లు చెప్పారు. అనంతరం షాబాద్ మండల కేంద్రంలోని పీఆర్‌ఆర్ స్టేడియంలో క్రీడల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు.

## నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

కందుకూరు. ఫిబ్రవరి 29: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సరిత కోరారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో మిషన్‌భగీరథ డీఈ జగన్‌మోహన్‌రెడ్డి కలిసి ఆమె మాట్లాడారు. ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుందని, ఆయా గ్రామాలకు కేటాయించిన ప్రత్యేక అధికారులకు అందుబాటులో ఉండాలని తెలిపారు. వేసవి సమీపిస్తున్నందున గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా పంచాయతీ కార్యర్శులు చొరవతీసుకోవాలని కోరారు.

# సదరం ఆన్‌లైన్ స్లాట్స్ కోసం పడిగాపులు



మీ సేవ కేంద్రం వద్ద కుటుంబ సభ్యులతో కలిసి వేచి చూస్తున్న ఓ దివ్యాంగుడు

పెద్దఅంబర్‌పేట, ఫిబ్రవరి 29: జిల్లాలో గురువారం ఉదయం 11 గంటలకు సదరం ఆన్‌లైన్ స్లాట్ బుక్ చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్టు అధికారులు ముందుగానే ప్రకటించారు. దీంతో గురువారం ఉదయం నుంచే దివ్యాంగులు స్లాట్ బుక్ చేసుకునేందుకు గంట, రెండు గంటల ముందుగానే మీ సేవా కేంద్రాల వద్దకు చేరుకున్నారు. అధికారులు ప్రకటించిన సమయానికి సదరం ఆన్‌లైన్ స్లాట్ సైట్ ఓపెన్ కాలేదు. కుటుంబ సభ్యుల సహాయంతో మీ సేవా కేంద్రాలకు చేరుకున్న దివ్యాంగులు గంటల తరబడి అక్కడ వేచి చూడక తప్పలేదు. కొందరు దాదాపు రెండు గంటల పాటు వేచి చూసి నిరాశగా వెనుదిరిగారు.

# హోంగార్డు కుటుంబానికి పోలీసు సిబ్బంది అండ



హోంగార్డు ప్రవీణ్ భార్య చికిత్స నిమిత్తం ఆర్థికసాయం అందజేస్తున్న పట్నం పోలీసు సిబ్బంది

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 39 : ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు ప్రవీణ్ భార్య అనారోగ్యంతో నగరంలోని ఓ ఆస్పత్రిలో చకిత్స పొందుతున్నది.
విషయం తెలుసుకున్న ఇబ్రహీంపట్నం పోలీసులు హోంగార్డు ప్రవీణ్ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉండటంతో అతడి భార్య వైద్య చికిత్స నిమిత్తం సిబ్బంది రూ.56వేల ఆర్థిక సాయాన్ని గురువారం ప్రవీణ్‌కు అందించారు. కార్యక్రమంలో ఎస్సైలు మారయ్య, నాగరాజు, మైబెల్లి, రామకృష్ణ తదితరులున్నారు.

# ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలి

- డీఆర్డీవో శ్రీలత



రాచులూరులో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న శ్రీలత

**కందుకూరు, ఫిబ్రవరి 29:** జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీల కు పనిచేసే చోట వసతులను కల్పించాలని రంగారెడ్డి జిల్లా డీఆర్‌డీఓ శ్రీలత తెలిపారు. మండలంలోని రాచులూరులో ఉపాధి పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ.. పని దినాలను సక్రమంగా వినియోగించుకుంటున్నారా అని అడిగారు. కూలీలు పనిచేసే స్థలంలోనే తాగునీరు, షెడ్ నెట్, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అనంతరం బేగంపేట్‌లో వననర్సరీని తనిఖీ చేశారు. ఖాళీ బెడ్స్‌లో నీడను ఇచ్చే మొక్కలతో పాటు అవెన్యూ ప్లాంట్స్ పెంచాలని సూచించారు. మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీడీ సక్రియ, కార్యదర్శి సెల్వామణి, పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి విరాళం



ఆలయ నిర్మాణానికి చెక్కులు అందజేస్తున్న నేతలు

చేవెళ్ల రూరల్, ఫిబ్రవరి 29 : దేవాలయ నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని చేవెళ్ల వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ దేవర వెంకటరెడ్డి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు బండారు ఆగిరెడ్డి అన్నారు. గురువారం చేవెళ్ల మండల పరిధిలోని ఆలూరు అనుబంధ గ్రామం వెంకన్నగూడలో ఆంజనేయ స్వామి దేవాలయం నిర్మాణానికి దేవర వెంకటరెడ్డి, బండారు ఆగిరెడ్డి రూ.లక్ష, కాంగ్రెస్ మండల నాయకుడు కావలి వెంకటేశ్ బాబు రూ.లక్ష, ఆలూరు మాజీ వార్డు సభ్యుడు కవ్వగుడెం శ్రీకాంత్ రూ.లక్ష విరాళాన్ని గ్రామానికి చెందిన నాయకుడు కొండన్నోల రాంరెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నీటి సమస్య తలెత్తకుండా కృషి చేస్తా



బోరుమోటార్‌ను ప్రారంభించిన కౌన్సిలర్ కొందూటి మహేశ్వరి

షాద్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 29 : షాద్‌నగర్ మున్సిపాలిటీలోని 20వ వార్డులో బోరుమోటార్‌ను కౌన్సిలర్ కొందూటి మహేశ్వరి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న వేసవి కాలం దృష్ట్యా నూతన బోరుమోటార్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వార్డులో ఎలాంటి నీటి సమస్య తలెత్తకుండా కృషి చేస్తానన్నారు. ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వహిద్, శివ, అనూప్ పాల్గొన్నారు.

## నష్టాల్లో ఉన్న సహకార సంఘాన్ని లాభాల బాటలోకి తీసుకొచ్చాం

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 29 : నష్టాల్లో ఉన్న బాటసింగారం రైతు సేవా సహకార సంఘాన్ని లాభాల బాటలోకి తీసుకొచ్చామని చైర్మన్ విఠల్‌రెడ్డి అన్నారు. తన పై 9 మంది డైరెక్టర్లు పెట్టిన అవిశ్వాసం చెల్లదని మండల కేంద్రంలోని సహకార సంఘం ప్రధాన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంఘానికి నియమ నిబంధనలు, పరిమితులు ఉంటాయన్నారు. సంఘం లెక్కలపై జనవరిలోనే డీసీఓకు తనిఖీ చేయమని వినతి పత్రం ఇచ్చినట్లు పేర్కొన్నారు. 2013లో రూ.3.5 కోట్ల నష్టాల్లో ఉన్న సంఘాన్ని ప్రస్తుతం లాభాల బాటలోకి తీసుకురావడం జరిగిందన్నారు. నూతన సంఘ భవనం నిర్మించామని, ప్రభుత్వం చేత 200 గజాల స్థలాన్ని బాటసింగారంలో కేటాయింపజేసి నూతన భవనం నిర్మించామని తెలిపారు. అధికార పార్టీ అండదండలతో తనను ఇబ్బంది పెట్టినా న్యాయస్థానంలో మా పార్టీ పెద్దలు, కార్యకర్తలు, రైతుల సహకారంతో న్యాయస్థానంలో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డైరక్టర్ కందాడి మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.